నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 12 మే 2024 | SANGAREDDY

# గజ్వేల్ నవ నిర్మాత కేసీఆర్

## కేసీఆర్ రాక ముందు ఎట్లుండే... కేసీఆర్ వచ్చినంక ఎట్లయింది

- గజ్వేల్ గౌరవం, ప్రతిష్టను పెంచింది కేసీఆరే...
- వెంకట్రామిరెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలి
- గజ్వేల్ రోడ్‌షోలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తరలివచ్చిన గులాబీ శ్రేణులు, ప్రజలు



గజ్వేల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 11: కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే...కేసీఆర్ వచ్చినంక ఇప్పుడెట్లుందో ప్రజలు ఆలోచన చేయాలే... గజ్వేల్ రూపురేఖలు మార్చిన కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. మాయమాటలు చెబుతూ కాంగ్రెస్ దేవుడి మీద ఒట్టు పెడితే...బీజేపీ మన నెత్తిమీద చేయి పెడుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తానని కుటుంబం మీద ఒట్టుపెట్టి ప్రజలకు మాట ఇచ్చిన వెంకట్రామిరెడ్డికే మద్దతు తెలుపాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గెలువగానే పిల్లలకు ఉద్యోగాలు వచ్చేలా శిక్షణ ఇప్పిస్తానని, పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తానని, రూపాయికే ఫంక్షన్ హాల్, రూ. 10లక్షల బీమా చేస్తానని మీ ముందుకొచ్చిన వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దన్నారు. తెలంగాణ ప్రదాతేకాదు... గజ్వేల్ నవ నిర్మాత కేసీఆర్ అని పేర్కొన్నారు. అప్పుడు గజ్వేల్‌లో చేసిన అభివృద్ధిని చూసి కేసీఆర్‌ను తిట్టిపోసిన ప్రతిపక్షాలు నేడు సిగ్గులేకుండా ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికొచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ఈరోజు పోటీ ఎవరి మధ్య అంటే గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లకు, గజ్వేల్ అభివృద్ధికి మోకాలు అడ్డం పెట్టినోళ్లకు, అభివృద్ధిలో గజ్వేల్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మన కేసీఆర్‌కు మధ్య పోటీ అన్నారు. దుబ్బాకలో ఎమ్మెల్యేగా గెలిచి రూపాయి పని చేయకపోతే దౌల్తాబాద్, రాయపోల్ అక్కాచెల్లెళ్లు 54వేల ఓట్లతో బండకేసి కొట్టారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ రూ.4వేల పింఛన్ ఇస్తానని మోసం చేసిందని, 5నెలలు గడిచినా పింఛన్ పెంచలేదని, ప్రతి అవ్వతాతకు రూ.10వేలు బకాయి పడ్డారన్నారు. వంద రోజుల్లో మనకు గాడిద గుడ్డు తప్పా ఏమీ ఇయ్యలేదన్నారు. రూ. 2500 పడ్డ వాళ్లందరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని.. పడని వాళ్లంతా కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు.

### రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ పాలన

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రివర్స్ గేర్‌లో నడుస్తోంది. కాంగ్రెస్ వచ్చినంక కేసీఆర్ కిట్, గజ్వేల్‌లో రూ.150కోట్ల పనులను రద్దు చేశారని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. నిన్నటివరకు కేసీఆర్ పక్కనే ఉన్న లీడర్లు పార్టీలు మారారు. ఎక్కడ ప్రభుత్వం ఉంటదో అక్కడికి పోయారా ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు పోయారా మీరే ఆలోచన చేయాలన్నారు. ఎప్పటికైనా మనందరికీ శ్రీరామరక్ష కేసీఆర్, మనకు అన్నం పెట్టిన కేసీఆర్‌ను కాపాడుకోవాలన్నారు. ముస్లింల కోసం మసీద్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్, షాదీఖాన నిర్మించారని, క్రిస్టియన్ల కోసం క్రిస్టియన్ భవనాన్ని నిర్మించారన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ముందుకొచ్చిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఆగంకాకుండా మొదటి ఈవీఎంలోనే వెంకట్రామిరెడ్డి, కారు బొమ్మ చూసి ఓటు వేయాలన్నారు.

# ఆంధ్రాకి పయనం!



శనివారం రాత్రి పటాన్‌చెరు నుంచి ఆంధ్రా ప్రాంతానికి వెళ్తున్న ట్రావెల్ బస్సులు

- ఓటేయడానికి వెళ్తున్న ఏపీ ఓటర్లు
- బస్సులు కిటకిట..
- బస్సెక్కితే బీరు, బిర్యానీ ఆఫర్ చేస్తున్న పార్టీలు
- పార్లమెంట్, ఎమ్మెల్యే ఎన్నికలు ఒకేసారి ఉండటంతో అటు మొగ్గు
- రెండు చోట్ల ఓటర్లుగా నమోదు
- రానుపోను ఖర్చులిస్తున్న అభ్యర్థులు
- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన నేతలు

పటాన్‌చెరు, మే 11: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, సంగారెడ్డి తదితర నియోజకవర్గాల్లో నివసిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ఓటేయడానికి ఏపీ బాట పట్టారు. ఈనెల 13న తెలంగాణతో పాటు ఏపీలోనూ ఎంపీ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో అదే రోజున ఏపీ అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అక్కడ ఓటేయడానికి ఆసక్తి చూపి మూడు నాలుగు రోజులుగా ఏపీకి వెళ్తున్నారు. వీరి కోసం పోటాపోటీగా బస్సులు ఏర్పాటు చేస్తున్నాయి ఏపీలోని రాజకీయ పార్టీలు. అంతేకాకుండా బీరు, బిర్యానీతో జేబు ఖర్చుకు నగదు ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. ఈసారి ఏపీ అసెంబ్లీకి హోరాహోరీ పోరు జరుగుతున్నది. ప్రతి ఓటు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల స్థిరపడ్డ, నివసిస్తున్న ఏపీ వాసులను ఓటు వేసేందుకు రావాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. వారికోసం టూరిస్ట్ బస్సులు, ట్రావెల్ బస్సులు, కార్లు, ఇతర వాహనాలతో పాటు ట్రైన్ టికెట్లు సైతం బుక్ చేశారు. ట్రావెల్, టూరిస్ట్ బస్సులు, ఆర్టీసీ బస్సుల్లో రాబోతున్న ఓటర్లకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు ఇస్తున్నారని సమాచారం. ఏ పార్టీకి చెందిన నాయకులు ఆ పార్టీ ఓటర్లకోసం బస్సులను నేరుగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక బీరు.. ఒక బిర్యానీ పొట్లం, ఖర్చులకు కొంత నగదు, చల్లటి నీళ్ల బాటిల్‌ను ఇచ్చి బస్సు సీట్లలో కూర్చోబెడుతున్నారు. కుటుంబంతో పాటు వచ్చే వారికి కార్లను పంపుతున్నారు. ఇప్పుడు ఏపీలో ఓటుకు సగటున రూ. 5వేలు ఇస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. రానుపోను ఖర్చులతో పాటు తిరిగి వెళ్లేందుకు ఏర్పాట్లు సైతం చేస్తుండటంతో చాలా మంది ఓటర్లు ఈసారి ఏపీలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తిగా ఉన్నారు. పైగా శనివారం, ఆదివారం సెలవులు కావడంతో ఐటీతో పాటు ఇతర ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్పొరేట్ ఉద్యోగులకు సెలవులున్నాయి. శుక్రవారం రాత్రికే వేలాది మంది ఏపీకి బయలు దేరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 4.13 లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో దాదాపు 25శాతం వరకు ఏపీ వాళ్లు ఉన్నారు. వీరిలో అధికశాతం మందికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు ఉన్నాయి. ఇక్కడ స్థిరపడ్డవారిలో చాలామందికి ఏపీ రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఈసారి అక్కడ హోరాహోరీగా పోరు జరుగుతుండడంతో రెండుచోట్ల ఓట్లున్న వారు ఏపీలో ఓటేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అమీన్‌పూర్‌లోనే మొత్తం 84వేలమంది ఓటర్లు ఉండగా, ఏపీ ఓటర్లు 10వేలమంది వారి రాష్ట్రానికి ప్రయాణం అయ్యారని సమాచారం. పటాన్‌చెరు, బొల్లారం, రామచంద్రాపురం, భారతీనగర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల ఓటర్లు ఏపీకి ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారం, చిట్కుల్, గుమ్మడిదల, బొంతపల్లి, భానూర్, ఇంద్రేశం పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నవారిలో అధికశాతం మంది ఏపీలో తమ ఓటును అక్కడ వేసేందుకు వెళ్తున్నారు.

# ఎన్నికల ప్రచారానికి తెర

## ఎండలను లెక్కచేయకుండా అభ్యర్థుల ప్రచారం

- ఎన్నికల వ్యూహానికి పదునుపెట్టిన పార్టీలు
- ఓటర్లను ఆకట్టుకునేలా బీఆర్‌ఎస్ ప్రచారం



శనివారం శివ్వంపేట మండలం తార్యా తండాలో ప్రచారం చేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

సంగారెడ్డి మే 11(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నుంచే ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి తెరలేపాయి. ఎంపీ అభ్యర్థుల ప్రకటన వెలువడిన అనంతరం ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్లమెంట్ నియోజకవర్గాలను కలియతిరిగారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం సాగించారు. సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజక వర్గా లు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నా యి. సంగారెడ్డి, పటాన్‌చెరు మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉండగా, జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలోని ఐదు నియోజవకర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు శనివారం వరకు జోరుగా ప్రచా రం చేశారు. ప్రధాని మోదీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, సీఎం రేవంత్ తదితర దిగ్గజ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మోదీ జహీరాబాద్ పార్లమెంట్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. సీఎం రేవంత్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన బహిరంగ సభలో, పటాన్‌చెరులో రోడ్‌షోలో పాల్గొన్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా కేసీఆర్ రోడ్‌షోలు**

ప్రచారంలో మిగతా పార్టీల కంటే బీఆర్‌ఎస్ ముందంజలో ఉన్నది. ఇతర పార్టీల కంటే ముందుగానే బీఆర్‌ఎస్ మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. అభ్యర్థులను ప్రకటించిన వెంటనే మాజీమంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర, రోడ్‌షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొదట అందోలు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్ సమీపంలో లక్ష మందితో కేసీఆర్ భారీ బహిరంగ సభ జరిగింది. ఏ పార్టీ నిర్వహించని విధంగా కేసీఆర్ బహిరంగ సభ విజయవంతం కావటంతో పాటు ప్రజల నుంచి ఊహించని రీతిలో స్పందన లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ బస్సు యాత్ర జరిగింది. ఈనెల 8 పటాన్‌చెరులో కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో నిర్వహించారు. 50వేల మందితో నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ అయింది. కేసీఆర్ ప్రచారంతో బీఆర్‌ఎస్‌కు సంగారెడ్డి జిల్లాలో బలం పెరిగింది. ఇదిలాఉంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రచారం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ముమ్మర ప్రచారం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, పాలన విఫలం కావడంతో ఓటర్లు బీఆర్‌ఎస్ వైపు మొగ్గ చూపుతున్నారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**వ్యూహాలకు పార్టీల పదును...**

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈనెల 13న ఎన్నికల జరుగనున్నాయి. ఎన్నికలకు రెండురోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని బీఆర్‌ఎస్ బలంగా కోరుకుంటుంది. అందుకు అనుగుణంగానే కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. బీఆర్‌ఎస్ గెలుపు ఆవశ్యకతను అధినేత కేసీఆర్ ఓటర్లకు వివరించారు. దీంతో సంగారెడ్డి జిల్లాలోని ఓటర్లు బీఆర్‌ఎస్ వైపు మొగ్గ చూపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు పలుకుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రచారం ముగియటంతో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టింది. సోమవారం ఎన్నికల జరగనుండడంతో ఆదివారం పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, పోలింగ్ సిబ్బంది తరలించేలా ఏర్పాటు చేపట్టింది. ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సూచనలు చేస్తున్నారు.

